ప్రజాశక్తి
శనివారం 16 నవంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



చెరువుకు గండి పడి నీరు పోతున్న దృశ్యం

భారీ వర్షాలతో

జువ్వలగుంట చెరువుకు గండి

- వృథాగా పోతున్న నీరు
- పరిశీలించిన అధికారులు
- రైల్వే అధికారుల తప్పిదమే కారణం.!
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శింగరాయకొండ మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శుక్రవారం నాడు చెరువులకు గండ్లు పడ్డాయి. మండలంలోని మూలగుంటపాడు గ్రామపంచాయతీ పరిధిలోని జువ్వలగుంట చెరువు ఉంది. ఈ చెరువు పరిధిలోని దాదాపు 70 ఎకరాలకు పైగా మూలగుంటపాడు వెంకటేశ్వరకాలనీ, సోమరాజుపల్లి పంచాయతీలోని నర్రావారిపాలెం ప్రాంతాల రైతులు వరి పంట వేసుకొని వ్యవసాయం చేస్తుంటారు. గత మూడు రోజులుగా వర్షాల తాకిడికి నీరు అధికంగా చెరువుకు రావటం వల్ల చెరువు కట్టకు గండి పడింది. వర్షపు నీరు బయట పొలాల్లోకి వెళ్లిపోయింది. ఈ చెరువుకు పక్కనే రైల్వే లైను నిర్మాణం జరుగుతోంది. మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా మట్టిని విపరీతంగా తీసి వేయటంతో పాటు లారీలు విపరీతంగా పెద్దపెద్ద టర్బోలు తిరగటంతో ఆ కట్ట బలహీనపడింది. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఆ ప్రాంతంలోని రైతులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం ▶ 2లో

వరుస వర్షాలు

కర్షకులకు కన్నీళ్లు

- అధిక వర్షాలతో పంటలను కోల్పోతున్న రైతులు
- బాపట్ల జిల్లాలో సుమారు 25 వేల ఎకరాల్లో పంట నష్టం



చీరాల మండలంలో వరుస వర్షాల కారణంగా ఉరకెత్తిన పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి రబీ సీజన్ వరకు కూడా వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు అందోళన చెందుతున్నారు. గతంలో కన్నా భిన్నంగా ఈ ఏడాది ఎక్కువగా అల్పపీడన ప్రభావంతో వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలో ఒక ప్రాంత రైతులకు మేలు జరుగుతుండగా మరొక ప్రాంత రైతులు పంటలను నష్టపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి పంటల సాగుకు అవసరమైన మేరకు వర్షాలు కురిసిన పరిస్థితి లేదు. జిల్లాలో ఎగువ ప్రాంతంలో మాగాణి సాగుకు అవసరమైన మేర వర్షాలు కురవక కొమ్మమూరు కాలువకు కూడా సక్రమంగా నీటి విడుదల జరగలేదు. దీంతో వరినార్లు పోసేందుకు కూడా సాగు నీరు లేకపోయింది. వర్షాలు కూడా సక్రమంగా లేకపోవడంతో వెదపద్ధతిలో రైతులు వరిసాగు చేపట్టారు. వరిపైరులో మొలకలు వచ్చి ఎదుగుతున్న దశలో జూన్‌లో సాధారణ వర్షపాతం 71 మిల్లీమీటర్లు కాగా 117.57 మి.మీ వర్షపాతం నమోదయింది. ఈ కారణంగా వెదపద్ధతిలో వరి సాగు చేసిన రైతులు నష్టపోయారు. మరలా వరినారు కొని సాగు చేశారు. జూలైలో కూడా 118.50 మి.మీ.ల సాధారణ వర్షపాతం కాగా 143.40 మి.మీ.ల వర్షపాతం నమోదయింది. ఆగస్టులో సాధారణం కన్నా తక్కువగానే వర్షాలు కురిశాయి. కానీ సెప్టెంబరు మొదటి వారంలో ఎగువ ప్రాంతంతో పాటు జిల్లాలో కురిసిన భారీవర్షాల కారణంగా కృష్ణానదికి వరద వచ్చి లంకగ్రామాలు, పంటపొలాలు నీటిలో మునిగి తీవ్రస్థాయిలో రైతులు నష్టపోయారు.

లోతట్టు ప్రాంతాల పొలాలు ఎక్కువ రోజులు వరదనీటిలోనే ఉన్న నేపథ్యంలో రైతులు చాలావరకు తమ పొలాల్లో తిరిగి పంట సాగు చేయలేక పొలాలు వదిలేశారు. సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 157.8 మి.మీ కాగా 232.3 మి.మీ వర్షపాతం నమోదయింది. దీంతో ఆగస్టులో సాగు చేసినా లేత వరి పొలాలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఉన్న లంక భూములు ముంపునకు గురయ్యాయి. వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజవర్గాల పరిధిలో ఉన్న వేలాది ఎకరాలల్లో ఉన్న వరి, కంద, పసుపు, అరటి, తమలపాకుల తోటలు నీట మునిగి రైతులు అపారంగా నష్టపోయారు. ఇదే సమయంలో కొమ్మమూరు కాలువకు గండ్లు పడి సాగునీరు దిగువకు రాక చీరాల, పర్చూరు ప్రాంతంలో సాగు చేసిన వరి పంటకు నీరందక రైతులు ఇక్కట్లు పడ్డారు. ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీరు మాగాణి భూములకు చేరవేసుకోవడంతో రైతులకు వ్యవసాయ ఖర్చు తడిచి మోపెడయింది.

సెప్టెంబరు నెలలో జిల్లాలోని ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు నీట మునిగిన లోతట్టు ప్రాంత పంట భూములు అప్పటి నుంచి వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా నీటిలోనే ఉండిపోయాయి. రైతులు కూడా ఒక పంటను పూర్తిగా వదిలేశారు. సాధారణంగా మొదటి పంటను కోల్పోయిన ▶ 2లో

● తీరంలో కార్తీక శోభ..



సూర్యలంక తీరానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా వచ్చిన భక్త జనం

కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రకాశం, బాపట్ల జిల్లాలో సముద్ర తీరాల వద్దకు శుక్రవారం భక్త జనం పోటెత్తారు. సముద్ర స్నానాలు ఆచరించి.. అక్కడే పూజలు నిర్వహించారు. బాపట్లలోని సూర్యలంక తీరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా సుమారు 400 మంది స్థానిక, మెరైన్ పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించినట్లు ఎస్పీ తుషార్ డూడీచెప్పారు.



కొత్తపట్నం తీరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉచిత ఇసుక విధానంలో

కొత్తగా రెండు రేవులు గుర్తింపు

కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉచిత ఇసుక విధానంలో భాగంగా బాపట్ల జిల్లాలో కొత్తగా రెండు ఇసుక రేవులను గుర్తించామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై మైన్స్ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్‌కుమార్ మీనా రాష్ట్ర రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ వెంకట మురళి హాజరయ్యారు. నదులకు ఆనుకుని ఉన్న గ్రామాలలోని ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకువెళ్లడానికి మండల స్థాయి అధికారి అనుమతులు ఇవ్వాలని ముఖేష్‌కుమార్ మీనా చెప్పారు. ఇసుక కావాల్సినవారు సంబంధిత గ్రామ సచివాలయంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పక్కాగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘునకు గురికాకుండా పర్యవేక్షణ పెరగాలన్నారు. డిసెంబర్ 19వ తేదీన మరుగుదొడ్ల దినోత్సవం నేపథ్యంలో ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకునేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు నెల రోజులపాటు మరుగుదొడ్ల, పరిశుభ్రతపై ప్రజలలో విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. కొత్త మరుగుదొడ్లు మంజూరు చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకుని వారిని గ్రామ పంచాయతీ స్థాయిలో గుర్తించి బహుమతులు ప్రకటించాలన్నారు. బాపట్ల జిల్లాలో ఇసుక లభ్యత ఉన్న రెండు ప్రాంతాలను గుర్తించామని కలెక్టర్ వెంకట మురళి రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీకి వివరించారు. పర్యావరణ అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. అనుమతులు రాగానే ఆ రేవులలో ఇసుక తవ్వకాలు ప్రారంభిస్తామన్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, గాజుర్లంక ప్రాంతాలలోని ఇసుక రేవుల వద్ద నీటి ప్రవాహం ఉందన్నారు. గాజర్లంక వద్ద నీటి ప్రవాహం ఉన్నందున ఇసుక తవ్వకాలు నేటికీ ప్రారంభం కాలేదన్నారు. ఈ వీక్షణ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, మైన్స్ ఏడి రాజేష్, డిపిఓ ప్రభాకర్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు పాల్గొన్నారు.

వరుస వర్షాలు.. కర్షకులకు కన్నీళ్లు..

(మొదటిపేజీ తరువాయి)

రైతులు రెండో పంటగా మినుము లేదా మొక్కజొన్న సాగు చేస్తారు. కానీ వర్షపు నీరు బయటకు వెళ్ళే మార్గం లేకపోవడంతో లోట్టు ప్రాంతంలో ఉన్న పంట భూములన్నీ వరద నీటిలోనే ఉండి పోవడంతో వేలాది ఎకరాల్లో రెండో పంట సాగు కూడా రైతులకు సాధ్యపడిన పరిస్థితి లేదు. అక్టోబరు నెలలో కూడా సాధారణ వర్షపాతం 171.9 మిల్లీమీటర్లు కాగా 215.7 మి.మీ వర్షపాతం నమోదయింది. ఈ నెలలో కూడా వరుసగా ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా వర్షాలు పడి పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగా జిల్లాలో సుమారు 25 వేల ఎకరాల్లో సాగు చేసిన మినుము, మిరప, పత్తి, మొక్కజొన్నతో పాటు లోతట్టు ప్రాంతంలో సాగు చేసిన వరి పైరుకు నష్టం వాటిల్లింది. వరి కంకి బయటకు వచ్చిన క్రమంలో బరువుగా నేలవాలుతోంది. వరద ప్రభావం నుంచి రైతులు ఇంకా కోలుకోకముందే నవంబరు నెలలో కూడా అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అంతటా సాగు చేసిన మెట్టపైర్లకు నష్టం వాటిల్లుతోంది. ప్రధానంగా కూరగాయలు, పూల తోటల సాగు చేస్తున్న చిన్న రైతులు నష్టపోతున్నారు. మరలా సాగు చేయడం, వర్షాలతో పంట కొల్పోవడం జరుగుతోంది. మినుము, మొక్కజొన్న, మిరప, పొగాకు చేలు ఉరకెత్తుతున్నాయి. ఈ ఏడాది ఇదే తీరున వర్షాలు పడితే తీవ్రస్థాయిలో నష్టపోతామన్న ఆందోళనలో రైతులున్నారు.

జువ్వలగుంట చెరువుకు గండి

(మొదటిపేజీ తరువాయి)

వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. శుక్రవారం ఉదయాన్నే భారీ వర్షం రావడంతో చెరువు కట్ట తెగిపోయి కనిపించడంతో రైతులు అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. తహశీల్దార్ టి.రవి, ఇరిగేషన్ అధికారులు తెగిపోయిన చెరువు కట్టను పరిశీలించారు. రైల్వే అధికారులు మూడో లైన్ నిర్మాణం చేయడం ద్వారా మట్టిని విపరీతంగా తీయడంతో పాటు కట్ట బలహీనపడటం ద్వారా తెగిపోయి నీరు బయటకు పోయిందని తేల్చారు. అయితే ప్రస్తుతం ఈ ఒక్క రూపాయి కూడా డబ్బులు లేకపోవడంతో ఏమీ చేయలేమని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చేతులెత్తేయడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. అయితే ఆ ప్రాంతంలో అధికంగా ఉండే గిరిజనులు, దళితులు మాత్రమే ఎక్కువగా అక్కడ పొలాలు పండించుకుంటుంటారు. ఎక్కువ స్థాయిలో పంటలు వేయనప్పటికీ రైతులు మాత్రం ఆ చెరువు కింద చిన్న చిన్న పంటలు వేసుకొని పశువులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటారు. ఈ జువ్వలగుంట చెరువుకు ప్రస్తుతం గండిపడటంతో అధికారులు అక్కడికి వెళ్లి ప్రస్తుతం ఇసుక బస్తాలు వేస్తామని తరువాత నిధులు వస్తే పూర్తిస్థాయిలో బాగు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గండిపడిన ప్రాంతం నుంచి వర్షపు నీరు అధిక సంఖ్యలో బయటికి వెళ్లిందని రైతులు చెబుతున్నారు. వర్షపు నీరు ఎక్కువ స్థాయిలో బయటికి పోవడం ద్వారా ప్రస్తుతం పంటలు వేసే పరిస్థితి కూడా ఉండదనిఆందోళన చెందుతున్నారు.

నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో వైవీ

ప్రజాశక్తి-పొదిలి



పాల్గొన్న వైవి సుబ్బారెడ్డి

దర్శి మాజీ శాసన సభ్యులు సానికొమ్ము పిచ్చిరెడ్డి కుమారుడు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం సందర్భంగా శుక్రవారం ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు, టిటిడి మాజీ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. వైసిపి నాయకులు, కార్యకర్తలతో ఆయన పలు అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ గుజ్జుల రమణా రెడ్డి, కసిరెడ్డి వెంకట రమణారెడ్డి, జి శ్రీను, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు ఉడుముల పిచ్చిరెడ్డి, వరలక్ష్మమ్మ, బాషా, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఆర్‌టిసి బస్టాండు

ఆకస్మిక తనిఖీలో అవాక్కయిన సబ్ కలెక్టర్ త్రివినాగ్

ప్రజాశక్తి-మార్కాపురం



బస్టాండును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ప్రమాదకర స్థితిలో ఉన్న మార్కాపురం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండును కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్ గురువారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి పరిస్థితులను చూసి అవాక్కయ్యారు. బస్టాండు భవనం పైకప్పు ఎప్పుడు కూలిపోతుందో అనే విధంగా శిథిలమైంది. తక్షణమే స్పందించాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్ మార్కాపురం డిపో మేనేజర్ ఎఎస్ నరసింహులును ఆదేశించారు. ఆర్‌టిసికి నివేదిక పంపాలన్నారు. నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టేందుకు వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని, తాను కూడా లేఖ ద్వారా తెలియజేస్తామని చెప్పారు.

సభ్యత్వ నమోదుపై ఎమ్మెల్యే బీఎన్ సమావేశం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలు మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర గల సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులతో శుక్రవారం సభ్యత్వా ల నమోదు కార్యక్రమాల మీద శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో టీడీపీ సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకునే విధంగా చూడాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి బాబు, రాష్ట్ర టీడీపీ సెక్రటరీ అడక స్వాములు, మండల పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, మద్దినేని హరిబాబు, తేళ్ల మనోజ్ కుమార్, మండవ జయంత్ బాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు వేల్పుల శ్రీనివాసరావు, వివరం గోవిందు, దేవబత్తిన ప్రసాద్, రావి శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందంజలో నిలవాలని ఎంపీడీవో డి సురేష్‌బాబు కోరారు. బంగారు బాలోత్సవంలో భాగంగా శుక్రవారం సంతనూతలపాడులోని షైనింగ్ స్టార్ ఎలైట్ స్కూల్లో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీవో సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ అనిత అధ్యక్షత వహించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు. విద్యా హక్కు చట్టం, బాలికల సంరక్షణ, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం తదితర వాటిపై ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి నాగలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ అనిత వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ ప్రతినిధి ఎంవి రమణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్ ప్రతాప్‌కుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీకార్యకర్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ గృహ ప్రవేశంలో కెపి

ప్రజాశక్తి-పొదిలి



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కెపి కొండారెడ్డి

పొదిలి మండలం తలమల్ల మాజీ సర్పంచ్, సీనియర్ వైసిపి నాయకులు కొండ్రగుంట సుబ్బారావు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో శుక్రవారం మార్కాపురం మాజీ శాసనసభ్యులు కేపీ కొండారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు షేక్ బందీసాహెబ్, ఉడుముల పిచ్చిరెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష దీపోత్సవం



లక్ష దీపోత్సవంలో మహిళలు

ప్రజాశక్తి-తాళ్లూరు: తాళ్లూరు మండలం బొద్దికూరపాడు గ్రామంలోని శ్రీగంగా పర్వత వర్ధిని సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసం, కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లక్ష దీపోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, సాయంత్రం లక్ష దీపోత్సవం, జ్వాలా తోరణం జరిగింది. శివాలయ ప్రాంగణం శివనామ స్మరణతో మార్మోగింది. లక్ష దీపోత్సవంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పూజారి నుదురుపాటి రమణయ్య, ఉద్దండం రమణయ్య, శివాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎన్

ఊరుకి, చెరువుకి దూరంగా పైపులైన్ వేయాలి: ఎమ్మెల్యే బీఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువులో గుండా వేస్తున్న బీపీసీఎల్ పైప్‌లైన్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారని ఊరికి చెరువుకి దూరంగా పైపులైన్ వేయాలని శుక్రవారం ఒంగోలులో జిల్లా కలెక్టరేట్‌లో పేర్నమిట్ట గ్రామ రైతులతో కలిసి ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాల్ కష్ణయ్యని కలిసి చర్చించారు. బీపీసీల్ పైప్‌లైన్‌ను చెరువుకు, ఊరికి దూరంగా వెయ్యాలని కోరారు. పైప్‌లైన్ వల్ల స్థానిక రైతులు పడే ఇబ్బందుల గురించి జేసీకి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ వివరించారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 3
శనివారం 15 నవంబర్ 2024

విద్యుత్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి-కొమరోలు



మృతిచెందిన వెంకటయ్య

విద్యుత్ షాక్‌తో గొర్రెల కాపరి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మొట్టుపల్లె గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గుండయ్య అనే రైతు పందుల నివారణ కోసం తమ పొలం చుట్టూ తీగలను అమర్చి రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చేసేవారు. ఉదయాన్నే వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపి వేసేవాడు. రోజులాగే గురువారం రాత్రి విద్యుత్ సరఫరా చేశాడు. ఉదయం వెళ్లి విద్యుత్ సరఫరాను నిలిపి వేయడం మరచిపోయాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన శిరబోయిన వెంకటయ్య (50) అనే గొర్రెల కాపరి అటవీ ప్రాంతానికి వెళ్లి కర్రలు తీసుకొండగా పొలానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బెల్ట్ షాపుపై దాడులు నిర్వహించి ఓ వ్యక్తి అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి. చౌడయ్య తెలిపారు. మండల పరిధిలోని గురిజేపల్లి గ్రామంలో ఓ వ్యక్తి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. . ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : పెద్దదోర్నాలలోని శ్రీశైలం రోడ్డు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న భూమని మల్లేశ్వరి అనే మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్ఒ చిన్నఓబులేసు

ఎన్నికల ప్రక్రియపై అవగాహన

ప్రజాశక్తి -మార్కాపురం రూరల్

నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని డిఆర్ఒ డి. చిన్న ఓబులేసు తెలిపారు. నీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ఇఒ, ఎఇఒ , పిఒ, ఎపిఒలకు స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణములో శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఓటరు జాబితా సక్రమంగా తయారు చేయాలన్నారు. తొలి దశలో నీటి వినియోగదారుల సంఘాలకు, రెండో దశలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, మూడో దశలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికల ప్రక్రియ చేపట్టాలన్నారు. మేజర్ ఇరిగేషన్, మీడియం ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్ విధానాలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు చిరంజీవి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ప్రజాశక్తి-టంగుటూరు

రైతులు పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయంగా మినుము, శనగ సాగు చేసుకోవాలని ఎఒ జి. స్వర్ణ లత తెలిపారు. మండల పరిధిలోని మల్లవరప్పాడు గ్రామంలో పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పంటల సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ పొగాకు పంట గిట్టుబాటు ధర ఉందని ప్రతి ఏడాది ఒకే పంట సాగు చేయడం వల్ల భూమిలో సారం తగ్గుతుందన్నారు. అందువల్ల ప్రత్యామ్నాయ పంటలైన మినుము, శనగ పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సంచాలకుడుఎ. శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కండక్టర్‌పై దాడి

వైద్యశాలలోని పరికరాలు ధ్వంసం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు నుంచి వర్ధినేనివారిపాలెం వెళ్తున్న బస్సును కామేపల్లి బొమ్మల సెంటర్ వద్ద రహదారిపై బైకులు ఉండటంతో డ్రైవర్ నిలుపుదల చేశాడు. అదే సమయంలో కామేపల్లి గ్రామానికి చెందిన పత్తిపాటి హరిబాబు బస్సు కిందకు దూరాడు. చక్రాలకు అడ్డుగా పండుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ సుబాషిణి కిందకు దిగి బయటకు రావాలని తెలిపింది. అయితే హరిబాబడు ఎంతకీ బయటకు రాలేదు. దీంతో సుభాషిణి సెల్ ఫోన్‌తో వీడియో తీసింది. ఈ విషయాన్ని గమనించిన హరిబాబు బస్సు కింద నుంచి బయటకు వచ్చి కండక్టర్ పై దాడికి దిగాడు. దీంతో ఆమె పరుగులు తీసింది. ఈ క్రమంలో డ్రైవర్ రెడ్డమ్మ హరిబాబును అడ్డుకోగా ఆయనపై కూడా దాడి చేశాడు. అంతే కాక కండక్టర్ సెల్ పగులగొట్టాడు. ఈ క్రమంలో కండక్టర్ బిపి, షుగరు పెరగడంతో పడిపోయింది. స్థానికులు కామేపల్లి పిహెచ్‌కి తరలించారు. కండక్టర్‌కు వైద్యసేవలు అందించిన డాక్టర్ రేష్మి, వైద్యసిబ్బందిపై నా హరిబాబు మాటల యుద్ధం చేశాడు. అంతటితో ఆగకుండా వైద్యశాలలోని సిసి కెమెరాలు, నేమ్ బోర్డులు, కుండలు, కుర్చీలు, ఫైర్ సిలిండర్‌ను పగులగొట్టాడు. ఇదేమని అడిగిన డాక్టర్ రేష్మిని దుర్భాషలాడాడు. ఇంతలో గ్రామస్తులు వచ్చి హరిబాబును అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఆర్‌టిసి కండక్టర్ సుభాషిణిని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై డాక్టర్ రేష్మి కామేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న కండక్టర్ సుభాషిణి

బైకు దొంగలు అరెస్టు

రూ.12 లక్షల విలువైన 17 బైకులు స్వాధీనం

ప్రజాశక్తి-దర్శి

బైకుల చోరీకి పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12 లక్షల విలువైన 17 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.దర్శి డిఎస్‌పి లక్ష్మీ నారాయణ తెలిపారు. డిఎస్‌పి కథనం ప్రకారం.. దర్శి సిఐ రామారావు ఆధ్వర్యంలో దర్శి ఎస్ఐ మురళి,పోలీసు సిబ్బంది కలిసి పోతవరం గ్రామ శివారులో శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో అనుమానాస్పదంగా రెండు బైకులపై వెళ్తున్న నలుగురు వ్యక్తులను ఆపి వారిని విచారించారు. వారి వద్ద ఉన్న 2 బైకులు దర్శి పోలీస్ స్టేషన్ ఏరియాలో చోరీ చేసినట్లుగా గుర్తించారు. అనంతరం వారిని పూర్తి స్థాయిలో విచారించగా గతంలో తాము చోరీ చేసి బైకు దొంగతనాలను ఒప్పుకొన్నారు. దర్శి పోలీస్ స్టేషన్ ఏరియాలో 7 బైకులు, కనిగిరి, పొదిలి, గుంటూరు జిల్లా పల్నాడు బాపట్ల జిల్లాలలో కూడా 10 బైకులు చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. చోరీ చేసిన బైకులను దేవవరం గ్రామానికి చెందతిన గోపి అనే బైక్ మెకానిక్‌కు అమ్మినట్లుగా చెప్పారు. దీంతో దర్శి ఎస్ఐ మురళి బైక్ మెకానిక్ గోపిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 15 బైకులను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదుమందిని అదుపులోకి తీసుకొని 17 బైకులను స్వాధీనం చేసుకున్నారు. దర్శి మండలం గంగపాలెం గ్రామానికి చెందిన అంకాల శ్రీను, కప్పల పవన్, కప్పల భవానీ శివశంకర్, బండారు శ్రీహరి, దేవవరం గ్రామానికి గుంజ గోపిని అరెస్టు చేసి బైకు చోరీలను చేధించిన దర్శి సిఐ వై.రామారావు, ఎస్ఐ మురళి, పోలీసు సిబ్బంది రాంబాబు, శివ శంకర్, మహేష్, గిరిని ఈ సందర్భంగా ఎస్‌పి అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

రాగితీగ చోరీ కేసులో నిందితులు అరెస్టు

- 16 కిలోల రాగి
- ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-దర్శి

విద్యుత్ ట్రాన్స్‌ఫారాలను పగలగొట్టి వాటిలోని రాగి తీగను దొంగలించి అమ్ముకొనే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌పి దామోదర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌పి వివరాలు వెల్లడించారు. దర్శి ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి అమ్ముకునే ముగ్గురిని త్రిపురాంతకం సిఐ హసన్ అరెస్టు చేసినట్లు తెలిపారు. దర్శికి చెందిన కుంజాల లింగేష్, తాళ్లూరుకి చెందిన కోలా జాన్సన్, నెల్లూరు జిల్లా లింగసముద్రం గ్రామానికి చెందిన గురునాథం లాజర్ ముఠాగా ఏర్పడి దొంగతనాలు చోరీలు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులు గంజాయి కూడా అమ్ముతున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 16 కేజీలు రాగి తీగ, ఒకటిన్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కురిచేడు రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ చూపి దర్శి డిఎస్‌పి లక్ష్మీనరాయణ, త్రిపురాంతకం సిఐ హసన్, పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి దామోదర్

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి- భట్టిప్రోలు

బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ శివయ్య కథనం ప్రకారం... ఈనెల 14న అబ్బన గూడవల్లి గ్రామానికి చెందిన బాలికను భట్టిప్రోలు మాలపల్లికి చెందిన దేవరపల్లి అభిషేయ్ అనే వ్యక్తి ఆటోలో ఎక్కించుకున్నాడు. అనంతరం కెఎస్‌కె కళాశాల వద్ద ఉన్న వాటర్ ట్యాంకు వద్దకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు.. బాధితుల ఫిర్యాదు మేరకు వేమూరు సిఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలం దారి విషయంలో ఘర్షణ.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పొలానికి వెళ్లే దారి విషయంలో దాయాదులు ఘర్షణ పడ్డారు. చివరకు గొడ్డలితో నరకగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గడ్డమీదపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. సంగబోయిన శ్రీను, సంగబోయిన సుబ్బారావుకు మధ్య పొలం దారి విషయంలో గత పది సంవత్సరాల నుంచి వివాదం నడుస్తోంది. దారి విషయమై రెవెన్యూ కార్యాలయంలో పలుమార్లు అర్జీలు అందజేశారు. గతంలో పంచాయితీలు సైతం జరిగాయి. అయినప్పటికీ దారి విషయం కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో సంగబోయిన సుబ్బారావు ప్రొక్లెయినర్ తీసుకెళ్లి పొలం రస్తా బాగు చేయిస్తున్నాడు. అదే సమయంలో సంగబోయిన శ్రీను వెళ్లి పేచిలో ఉన్న దానిని ఎలా బాగు చేయిస్తున్నావని అడిగాడు. దీంతో సుబ్బారావు తన ఇద్దరు భార్యలు వెంకటమ్మ, అల్లూరమ్మ, పిల్లలు వినోద్, కౌశల్య పక్కా ప్రణాళిక ప్రకారం ఇంటి నుంచి తెచ్చిన కారం శ్రీను కళ్లలో కొట్టారు. అనంతరం గొడ్డలితో తలపై నరికారు దీంతో శ్రీనుకు తీవ్ర తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడి యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘనపై ఎస్ఐ పి. చౌడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి పలువురికి గాయాలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మండల పరిధిలోని రాజుపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఒకేచోట రెండు రోడ్డు ప్రమాదాలు శుక్రవారం చోటుచేసుకున్నాయి. ఈ రోడ్డు ప్రమాదాలలో ఒకరు మతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేటకు చెందిన శంకరరావు, అమరనాథ్, సుధ, రాజేశ్వరి కారులో శ్రీశైలం బయలుదేరారు. రాజుపాలెం వద్దకు వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి మరో కారును ఢీకొంది. దీంతో అమర్‌నాథ్, సుధ, రాజేశ్వరి, కారు డ్రైవర్ మస్తాన్‌వలి, శంకర రావు గాయపడ్డారు. సత్యసాయి జిల్లాకు చెందిన జయసింహకు కాలు విరిగింది. కారులో ఇరుక్కుపోయిన వారిని గిద్దలూరు వైపు వెళ్తున్న సిమెంట్ లారీ డ్రైవర్ బయటకు తీసుకున్నాడు. అదే సమయంలో విజయవాడ నుంచి అనంతపురం వైపు వెళ్తున్న లారీ ఆగిన లారీని ఢీ కొట్టింది. దీనితో లారీ ఓనర్ తలారి శ్రీను (32) అక్కడికక్కడే మతి చెందాడు. క్షతగాత్రులను 108 వాహనంలో వినుకొండ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ శివ బసవరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -రాచర్ల

బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని రాచర్ల– ఆకవీడు రహదారిలో అనుములపల్లి గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆకవీడు గ్రామానికి చెందిన నందం సురేష్, జేపీచెరువు గ్రామానికి చెందిన నక్క రఘుకు గాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నందం సురేష్ ను 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు.



బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక బిబిహెచ్ కాలేజీ నందు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలోని ఇంటర్ కాలేజి ఛాంపియన్షిప్ సెలెక్షన్స్‌లో భాగంగా శుక్రవారం బాడ్మింటన్ ఉమెన్ విభాగం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు యూనివర్సిటీ పరిధిలోని వివిధ కాలేజీల నుండి 26మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొన్న వారిలో 7 గురు విద్యార్థినులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ జి ఆదిలక్ష్మి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను బంగారు పథకాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ సెలెక్షన్స్‌కు యూనివర్సిటీ పరిశీలకులుగా డిప్యూటీ డైరెక్టర్ ఐ దేవివరప్రసాద్, సెలక్షన్ కమిటీ సభ్యులు జి రమేష్ హాజరయ్యారు.

17న 'మంచాల' సంతాప సభ

ప్రజాశక్తి - ఇంకొల్లు



మంచాల రవిబాబు (ఫైల్)

ఈనెల 17న ఆదివారం గంగవరంలోని మంచాల వెంకట రామయ్య, రంగమ్మ విద్యా, విజ్ఞాన, వైజ్ఞాన కళ్యాణ మండప వేదికలో మంచాల రవిబాబు సంతాప సభ నిర్వహించనున్నారు. అక్టోబర్ 17న హైదరాబాదులో కామ్రేడ్ మంచాల రవిబాబు క్యాన్సర్ వ్యాధితో చనిపోయినట్లు గంగవరం విద్యా వైజ్ఞాన కళ్యాణ వేదిక నిర్వాహక మిత్రులు తెలిపారు. రవిబాబు గంగవరంలో కమ్యూనిస్టు కుటుం బంకు చెందిన మాజీ సర్పంచి మంచాల వెంకటరామయ్య, రంగమ్మ 2వ సంతానం. రవిబాబు అన్న మంచాల రమేష్ బాబు డాక్టర్‌గా మిర్యాలగూడలో స్థిరపడ్డాడు. విద్యావం తులుగా ఉద్యోగరీత్యా ఉన్నత స్థాయిలో స్థిరపడినప్పటికీ ఇరువురు తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ గ్రామానికి వస్తు గ్రామంలో సేవా కార్యక్రమాలు ఇప్పటికీ నిర్వహిస్తూ ఉంటారు. స్నేహశీలి, చింతనా పరుడైన రవిబాబు తన విద్యార్థి దశలో గోదావరి జిల్లాలో ఎస్ఎఫ్ఐ లీడర్‌గా పనిచేశాడు. ఐఆర్‌టిఎస్ కేడర్ ఉన్నతాధికారిగా రైల్వేలో చాలా కాలం సేవలందించారు. వ్యవసాయం మీద మక్కువ తో గ్రామీణ అభివృద్ధిపై ఆసక్తితో హైదారాబాద్ లోని ఎన్ఐఆర్‌డిలో డిప్యూటేషన్‌పై చాలా కాలం పని చేశారు. గత కొంతకాలంగా సామాజిక ఆర్థిక సాంస్కృతిక అంశాలపై ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేధావులతో ఉపన్యాసాలు నిర్వహించారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడు తూ ఉన్నాడు. ఆయన మృతదేహాన్ని ఆయన కోరిక మేరకు వారి కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి వైద్య పరిశోధనల నిమిత్తం అప్పగించారు. భార్య పంణిశ్రీ కాకినాడ జేఎన్టీయూ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.



సిసిరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టిడిపి నేతలు

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కారంచేడు

కారంచేడు గ్రామంలోని సాయి నగర్లో నూతన సీసీ రహదారి నిర్మాణ పనులను శుక్రవారం శంకుస్థాపన చేశారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు టిడిపి నేతలు రహదారి పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి బాలిగ శివ పార్వతి, నాయకులు శ్రీనివాసరావు, కార్యదర్శి, ఎంపిటిసి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సిపిఎం ప్రజాపోరు

ప్రజాశక్తి - పంగులూరు

అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు ఆందోళన శుక్రవారం స్థానిక తహాశీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, మండల కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడారు. గత నెల రోజులుగా కూరగాయలు, నిత్యవసర వస్తువులు, వంట నూనె ధరలు ఆకాశానికి పెరిగాయని అన్నారు. పండగల సందర్భంగా రోజువారి సరుకుల ధరల పెరిగాయని అన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరుకులలు సరసమైన ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్న యువత నిరాశకు గురవుతుందని, డీఎస్సీ వాయిదా పడిందని చెప్పారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, కనపడని ఆడపిల్లల సంఖ్య పెరుగుతుందని అన్నారు. టిడిపి కూటమి వాగ్దానాలు అమలులోకి రాలేదని, అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోతుందని, ఇసుక, మద్యం మాఫియాలు పెరిగిపోతున్నాయని అన్నారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమలులోకి రాలేదని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు పెంచమంటూనే ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో రూ.20వేల కోట్ల భారాన్ని ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిందని విమర్శించారు. కౌలు రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని, నిజమైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు వైఖరి అవలంబిస్తుందని, ఇది రాష్ట్ర అభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని విమర్శించారు. మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో ప్రైవేట్ పరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జ్వరాల బారిన పడి జనం నానా ఇబ్బందులు పడుతున్నారని, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు. తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహాశీల్దారు ఆదినారాయణకు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూసపాటి సుబ్బరాజు, రాయిని కృష్ణకుమారి, పాలపర్తి ఏలియా, రామచంద్ర రాజు, తలపనేని సుబ్బారావు, పోతుగంటి ఆధుం సాహెబ్ పాల్గొన్నారు.



తహాశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం నిరసన

విద్యుత్ రంగాన్ని జేబు సంస్థగా మార్చిన జగన్

ప్రజాశక్తి - ఇంకొల్లు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విద్యుత్ సంస్థలను వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి జేబు సంస్థగా మార్చుకొని విద్యుత్ వ్యవస్థలోని నిధులను ఇతర అవసరాలకు వాడుకున్నారని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. అసెంబ్లీలో విద్యుత్ సవరణ బిల్లుపై ఆయన మాట్లాడారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించేందుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సవరణ బిల్లును ప్రవేశపెట్టారని అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభానికి గురైందని పేర్కొన్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో 20మిలియన్ లోటు విద్యుత్ ఉందని, కరెంటు కోతలతో రాష్ట్ర సతమతం అవుతున్న తరుణంలో చంద్రబాబు నాయుడు సమర్థ వంతంగా 2014 -19 మధ్య భవిష్యత్త అవసరాలను దృష్టిలో ఉంచుకుని 24గంటలు నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించారని గుర్తు చేశారు. కరెంట్ బిల్లులు భవిష్యత్తులో పెంచమని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్నామని అన్నారు. విద్యుత్ రంగంలో సమూలమైన మార్పుకు నాంది పలికినట్లు వివరించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, అవినీతి ఆలోచనలతో తక్కువ ధరకు కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను, పీపీఎలు రద్దు చేయడం వల్ల రూ.వేల కోట్ల ఆర్థిక భారం వినియోగదారులపై వైసిపి ప్రభుత్వం మోపిందన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు కోరిన ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఏలూరి

నియోజకవర్గంలో ఆర్అండ్‌బి రోడ్ల అభివృద్ధికి సిఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిని శుక్రవారం మంత్రి ఛాంబర్‌లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కలిసి వినతి పత్రం అందజేశారు. దెబ్బతిన్న రహదారులకు యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని కోరారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో రోడ్లు మరమ్మత్తులకు నోచుకోక అస్తవ్యస్తంగా ఉన్నాయని తెలిపారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో వాహనాలన్నీ దెబ్బతింటున్నాయని తెలిపారు. ప్రజలకు ప్రయాణం తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. రోడ్ల అభివృద్ధికి తక్షణం నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

వాలీబాల్ జాతీయ పోటీలకు చైతన్య ఎంపిక

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరు పంచాయతీ కార్యలయంలో జూనియర్ సహాయకునిగా పని చేస్తున్న జమండ్లమూడి చైతన్య ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఎంపికయ్యారు. ఈ నెల 9న విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపాల్ స్టేడియంలో జరిగిన వాలీబాల్ స్టేట్ సెలెక్షన్‌లో ప్రతిభ కనపరిచి రాష్ట్రం తరపున ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున వరుసగా 9వ సారి ఎంపిక కావడం గమనార్హం. జాతీయస్థాయి వాలీబాల్ జట్టుకు జూనియర్ సహాయకుడు చైతన్య ఎంపిక కావటం పట్ల ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు, చెరుకూరు సర్పంచ్ పేరం సుబ్బారావు, ఎంపిడిఓ ప్రద్యుమ్న కుమార్, మాజీ జడ్పిటిసి డి ఉషారాణి, టిడిపి నాయకులు దాసరి రామకృష్ణ, వైస్ ఎంపిపి పాలేటి వీరయ్య, రాష్ట్ర పంచాయతీ జూనియర్ సహాయకుల సంఘం అధ్యక్షులు ఎం వెంకటరెడ్డి, ఎంపిపి మేక ఆనందకుమారి, వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న అభినందనలు తెలిపారు. ఈ ఎంపిక పట్ల చినగంజాం మండలం మోటుపల్లి సచివాలయంలో ఎఎన్ఎంగా పనిచేస్తున్న చైతన్య తల్లి జె సునీత మాట్లాడుతూ చాలా ఆనందంగా ఉందని తెలిపారు. 9సార్లు జాతీయ స్థాయిలో ఎంపిక కావటం పట్ల ఆనందభాష్పాలతో సంతోషం వ్యక్తం చేశారు. పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలలో ఈ పోటీలు జరుగుతాయని, ఐదు రోజులపాటు జరిగే పోటీలో పాల్గొంటానని చైతన్య ప్రజాశక్తికి వివరించారు.



వాలీబాల్ జాతీయ పోటీలకు ఎంపికైన జె చైతన్య



సెమినార్‌లో మాట్లాడుతున్న జోనాథన్

సహ చట్టంతో పారదర్శక పాలన

ప్రజాశక్తి - బాపట్ల

సమాచార హక్కు చట్ట సద్వినియోగం ద్వారా పాలనలో పారదర్శకతను సాధించవచ్చని రాష్ట్ర సమాచార కమిషనర్ పి శామ్యూల్ జోనాథన్ అన్నారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో పట్టణంలో స్త్రీ శక్తి భవన్‌లో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుందని చెప్పారు. ప్రజలను సాధికారులుగా తీర్చి దిద్దుతుందని అన్నారు. అధికార యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం అద్భుతమైన పాత్రను పోషిస్తుందని వివరించారు. సదస్సుకు ఫోరం ఫర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అధ్యక్షత వహించారు. సమాచార హక్కు చట్టం ద్విదశాబ్ది ఉత్సవాలు 2025లో నిర్వహిస్తామని చెప్పారు. పలువురు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో పౌర సమాఖ్య నాయకులు కె విజయ కుమార్, బి శరత్ బోస్, రమణకుమార్, జీవి, రవీంద్ర, సహ చట్టం ప్రచార కార్యకర్త బాలాజీరెడ్డి, రాజారావు, శేఖర్, న్యాయవాదులు జమృద్ బాషా, రామాంజనేయులు, భాస్కరరావు, గురజాల శ్రీనివాసరావు, హరిబాబు, సాంబయ్య, పాల్గొన్నారు.

టార్గెట్‌కు మించి స్త్రీ నిధి రుణాలు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో టార్గెట్‌కు మించి స్త్రీ నిధి రుణాలు ఇచ్చామని, స్త్రీనిధి మేనేజర్ టెక్కెం శ్రీనివాసరావు తెలిపారు. స్త్రీ శక్తి భవన్లో ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మండలంలో ఈ ఏడాది రూ.5050కోట్లు టార్గెట్ కాగా, ఇప్పటికే రూ.6.80కోట్ల స్త్రీనిధి రుణాలు ఇచ్చామని చెప్పారు. తాను యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు, పంగులూరు మండలాల్లో స్త్రీనిధి మేనేజర్‌గా పనిచేస్తుంటానని చెప్పారు. ఆయా మండలాల్లో పొదుపు మహిళలకు జీవనోపాదుల అభివృద్ధి కోసం స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. వాటిని జీవనోపాదుల కోసం ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలనేది బ్యాంకు ఉద్దేశమని చెప్పారు. స్త్రీనిధి రుణాలు ఇవ్వడంలో జిల్లాలో 2వ స్థానంలో ఉందని, మొదటి స్థానంలో రేపల్లె మండలం ఉందని తెలిపారు. మండలంలో ప్రతి నెల స్త్రీ నిధి రుణాల రికవరీలో దాదాపు 99శాతం పూర్తి చేస్తామని తెలిపారు. అయితే ఇప్పటికి మండలంలో 94శాతం రికవరీ జరిగిందని చెప్పారు. నెలాఖరుకు 99శాతం పూర్తి చేస్తామని అన్నారు. రికవరీలో పంగులూరు మండలం జిల్లాలో ప్రతినెల ఐదు, ఆరు స్థానాల్లో ఉంటుందని, నూరు శాతం రికవరీ జరిగితే ఇచ్చే రుణాలు మరింత పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఎస్పీ కార్యాలయం వద్ద

ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి

మృతదేహాన్ని చూడకుండానే వెళ్లిపోయిన బంధువులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌పి కార్యాలయం బయట ఈ నెల 11న పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న కర్ణాటక యువతి యశోద చౌహాన్ (25) ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. యశోద ఒంగోలులో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన విషయాన్ని తాలూకా సిఐ అజయ్ కుమార్ కర్ణాటకలోని బంధువులకి వెంటనే తెలియజేయగా.. వారు రావటానికి నిరాకరించారు. పోలీస్ అధికారుల విజ్ఞప్తితో బంధువులు ఒంగోలు ఆసుపత్రికి వచ్చినా.. మృతదేహాన్ని కూడా చూడకుండానే వెళ్లిపోయారు. ఈ క్రమంలో యశోద అనాథ మృతదేహంగా జిజిహెచ్ మార్చురీలో ఉంది. సమయం మించిపోయిందని వైద్యులు పోస్టుమార్టం చేయలేదు. శుక్రవారం మధ్యాహ్నం తాలూకా సిఐ అజయ్‌కుమార్ మరియు ఒంగోలు తహశీల్దార్ వాసు ఆధ్వర్యంలో దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, దారా అంజయ్య, మాల వేదిక న్యాయవాది చేబ్రోలు సుజన్‌రాజ్, గిరిజన నాయకుడు గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో శవ పంచనామా జరిగింది. ఈ సందర్భంగా నీలం నాగేంద్రం మాట్లాడుతూ ముత్తయ్య ప్రేమ పేరుతో యశోదను మోసం చేసి.. ఆమె మృతికి కారణమయ్యాడని, ముత్తయ్యను అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డ్రోన్‌లతో నిఘా..
- ఎస్పీ తుషార్ డూడి



తీరంలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కార్తీక పౌర్ణమి సందర్భంగా పుణ్యస్థానాలు ఆచరించడానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం జిల్లాలోని సముద్ర తీరాల వద్ద, కష్ణనది పరివాహక ప్రాంతాలలో, దేవాలయాలు ఇతర ముఖ్యమైన ప్రాంతాలలో జిల్లా పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ నిర్వహించి "సూర్యలంక" సముద్రతీరంలో పోలీస్ అధికారులు తీసుకున్న భద్రత పరమైన చర్యలను పరిశీలించారు. వాచ్ టవర్స్ పై నుండి సముద్రతీరాన పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను, పార్కింగ్ ప్రదేశాలలో వాహనాల పార్కింగ్ చేసిన విధానాన్ని పరిశీలించి పోలీస్ అధికారులకు పలుసూచనలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 400 మంది స్థానిక, మెరైన్ పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించినట్లు చెప్పారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే ప్రదేశాలలో లైఫ్ జాకెట్లు, రోప్ లు ధరించిన సివిల్, మెరైన్ పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను నియమించడం జరిగిందన్నారు. సముద్రంలో ఎక్కువ లోతులోకి వెళ్లకుండా ఎరుపు రంగు జెండాలను ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ఎవరైనా వాటిని దాటి లోపలకు వెళుతుంటే అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా పోలీస్ సిబ్బంది హెచ్చరిస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేశారన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డ్రోన్ ల ద్వారా సముద్రతీరంలో నిఘా ఉంచామన్నారు. నిర్దిష్ట లోతులో పడవలలో పోలీస్ అధికారులు సిబ్బంది, గజ ఈతగాళ్ల గస్తీ నిర్వహించారన్నారు. భక్తులు వారితోపాటు వారి పిల్లలను పుణ్యస్నానాలు ఆచరించడానికి తీసుకుని వచ్చినప్పుడు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా భక్తులు అనుకోని ప్రమాదానికి గురైన, ఏవైనా సమస్యలు తలెత్తినా వారిని రక్షించేందుకు, వారికి భద్రత కల్పించేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట బాపట్ల డిఎస్పీ ఏ రామాంజనేయులు, రూరల్ సిఐ హరికష్ణ ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కొండపి ఇన్‌ఛార్జిగా శ్రీపతి సతీష్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా శ్రీపతి సతీష్‌ను పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నియమించారు. ఈ సందర్భంగా శ్రీపతి సతీష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనను ఇన్‌చార్జిగా నియమించిన పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీకి, యువనేత రాహుల్ గాంధీకి, ప్రియాంక గాంధీకి, రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మాణిక్యం ఠాకూర్ కి, రాష్ట్ర అగ్ర నాయకులు కొప్పుల రాజుకి,రఘువీరా రెడ్డికి,శైలజ నాథ్ కి,గిడుగు రుద్రరాజుకి, సిరివెళ్ల ప్రసాద్, ఎన్.తులసి రెడ్డికి, ఈదా సుధాకర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు ఎస్‌కె సైదాకు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సూపర్‌స్టార్ కళా పరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలు సివిఎన్ రీడింగ్ రూమ్ లో నట శేఖర కష్ణ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమం కవి ,రచయిత, సూపర్ స్టార్ కష్ణ పరిషత్ అధ్యక్షులు జాలాది మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కవి, రచయిత కుర్రా ప్రసాద్ మాట్లాడుతూ సూపర్ స్టార్ కష్ణ అనేకవిదాలుగా ప్రజలకు అవసరమైనప్పుడు సేవలు అందించరని గుర్తు చేశారు. రంగభూమి కళాకారుల సంగం నాయకులు ధేనువకొండ సుబ్బయ్య, అంగలకుర్తి ప్రసాద్ ఉప ఖజానాధికారి షేక్ అబ్దుల్ కాదర్, గిరిజన ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు గంటా సుబ్బారావు, ప్రిన్సిపల్ ఐ నరసింహం, మీడిదొడ్డి చంద్రశేఖర్, పరుచూరి నాగేంద్రం, గర్నెపూడి యోబు, కనపర్తి జాన్, యేండ్లూరి నాగేశ్వరరావు, పాలేటి కోటేశ్వరరావు, కష్ణ అభిమానులు, వివిధ సాహిత్య, కళాకారుల సంఘాల ప్రతినిధులు పాల్గొని కృష్ణ సేవలను కొనియాడారు.

ఎస్టీల అభ్యున్నతికి అన్ని విధాలా కృషి

కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎస్టీల అభ్యున్నతికి అన్ని విధాలుగా కషి చేస్తామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. బిర్సా ముండా జయంతిలో భాగంగా గిరిజన స్వాతంత్ర సమరయోధులైన బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు, గాము గంట దొర, గామ మల్లు దొర, బోనంగి పండు పడాల్, కుడుముల పెద్ద బయ్యన్న, హనుమంతప్ప, కారం తమ్మన్న దొరల చిత్రపటాలకు జిల్లా కలెక్టర్ పుష్పమాలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గిరిజన సంఘాల నాయకులకు జిల్లా కలెక్టర్ శాలువాలు కప్పి పుష్పమాలలతో ఘనంగా సత్కరించారు. నేటి యువతరం సామాజిక స్పహతో మెలగాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. ఎస్టీల్లోని యువత భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలంటే స్వాతంత్ర సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బ్రిటిష్ పరిపాలనను వ్యతిరేకించి మొట్టమొదటిగా పోరాటాలు చేసిన వారంతా గిరిజన నాయకులేనన్నారు. బ్రిటిష్ రాక్షస పరిపాలనను వ్యతిరేకించిన తొలి గిరిజన స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా అని చెప్పారు.

ప్రభుత్వ సంక్షేమ ఫలాలను గిరిజనులకు అందించడానికి కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ఆదివాసి దినోత్సవం రోజున నిర్ణయించుకున్న అంశాలను తక్షణమే అమలు చేయడానికి యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. జిల్లాలో 75 వేల మంది ఎస్టీ జనాభా ఉండగా, 3,712 మందికి ఆధార్ కార్డులు లేనట్లు గుర్తించామన్నారు. వారికి అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాలను జారీ చేశామన్నారు. మరి కొన్ని ఎస్టీ కుటుంబాలు ఉపాధి కొరకు హైదరాబాద్ కు వలస వెళ్లినట్టు గుర్తించామన్నారు. తిరిగి తమ స్వగ్రామాలకు చేరితే ఆధార్ కార్డు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. చీరాల మండలం బుర్లవారిపాలెం కాల్వపై బ్రిడ్జి నిర్మించాలని గిరిజన సంఘాల నాయకులు కోరడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తక్షణమే ఇంజినీరింగ్ అధికారులను పంపి అంచనాలు వేయడంతో పాటు నిర్మాణాలను చేపడతామన్నారు. ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని వివిధ సంఘాల నాయకులు కలెక్టర్ దష్టికి తీసుకురావడంతో ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గిరిజన భవనం ఏర్పాటు కొరకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఎస్టీల సంక్షేమం కొరకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్టీల సర్వే జరుగుతోందని, జవాబుదారి తనంతో పనిచేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఒక అధికారి నాలుగు ఎస్టీ కుటుంబాలను దత్తత తీసుకుని ప్రభుత్వ పథకాలను వారికి వర్తింప చేసేలా అధికారులందరికీ ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ , బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా ,జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి బి ప్రకాష్ రావు, గిరిజన సంఘాల నాయకులు దేవరకొండ రాము, టి మోహన్ కుమార్ ధర్మ, శ్రీను, శంకర్రావు, వెంకటేశ్వర్లు, ప్రతాప్ కుమార్, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ విస్తృత పర్యటన



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. అద్దంకి బస్టాండ్ సెంటర్, గుంటూరు రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. అక్కడ నీరు రోడ్ల మీదకు రావటాన్ని గమనించారు. అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు రోడ్డులో కుడివైపున ఉన్న కాలువ పూడికతీత పనులు చేసిన తర్వాత అక్కడ మట్టి ఉండకుండా తొలగించాలని చెప్పారు. మిగిలిన కాలువ పూడికను కూడా తీసేయాలని సూచించారు. కుడి ప్రధాన కాలువ పోతురాజు కాలువకు అనుసంధానం అయ్యే ప్రాంతంలో ముందు నుంచి ఉన్న పైప్‌లను తీసేసి కల్వర్టు నిర్మించాలని ఇంజనీరింగ్ విభాగం సిబ్బందికి సూచించారు. తర్వాత గుంటూరు రోడ్డులోని ఎడమవైపు ఉన్న ప్రధాన కాలువను పరిశీలించారు. ఎడమ కాలువ పూడికతీత పనులు చేపట్టాలని, అక్కడ ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అక్కడ ఇస్మాయిల్ రెస్టారెంట్ వాళ్లు ఎక్కువగా కాలువ ఆక్రమించడాన్ని గమనించి హోటల్ యజమాన్యంతో చర్చించారు. కాలువ మీద కాంక్రీట్ కట్టడాలు తీసేయాలని టౌన్‌ప్లాన్ సిబ్బంది సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డివైడర్ల గోడల మీద స్టిక్కర్లు అంటిస్తున్నారని, వాటిని ఇకమీదట అంటిస్తే జరిమానా కట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజనీర్ చంద్రయ్య, డీఈఈ పద్మజ, అనిల్, టీపివో బాబురావు, టిపిఎస్ శివప్రసాద్, నారాయణ తదితరులు ఉన్నారు.

మంగమూరు రోడ్డును ముక్కలు చేశారు.!

'ఇదేం పోలీసింగ్.?' అంటున్న ప్రజలు



మంగమూరు రోడ్డు జంక్షన్లో గాంధీనగర్ వైపు వెళ్లే రోడ్డును మూసేసిన దృశ్యం..

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని మంగమూరు రోడ్డు జంక్షన్ ప్రాంతాన్ని ట్రాఫిక్, సివిల్ పోలీసులు ముక్కలుముక్కలుగా విభజించారు. దీన్ని చూసిన ప్రజలు ఇదేమి పోలీసింగ్.? అని అంటున్నారు. మంగమూరు రోడ్డు బైపాస్ జంక్షన్ నుంచి గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డును సిగ్నల్స్ వద్ద మూసేశారు. దీంతో సాయిబాబా గుడి ప్రాంతం నుంచి, లాయర్ పేట, రాజీవ్ నగర్ ప్రాంతం నుంచి వెళ్లే వాహనాలన్నీ మంగమూరు రోడ్డు జంక్షన్ కు కొద్దిగా ముందుకు వెళ్లి ట్రాఫిక్ డైవర్షన్ తీసుకొని గాంధీనగర్లోకి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ వాహనాలను తిప్పుకునే క్రమంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మంగమూరు రోడ్ జంక్షన్‌లో భారీ వాహనాల తాకిడి ఉంటుంది. చీమకుర్తి నుంచి వచ్చే గ్రానైట్ వాహనాలన్నీ కర్నూల్ రోడ్డు ప్లైఓవర్ రోడ్ నుంచి నగరంలోకి ప్రవేశించి మంగమూరు రోడ్డు జంక్షన్ మీదుగా వల్లూరు వైపు వెళ్తుంటాయి. మంగమూరు జంక్షన్ గాంధీ నగర్లోకి వెళ్లే వాహనాలను ట్రాఫిక్ డైవర్స్ ఇవ్వడంతో ఆ ముందువైపు ట్రాఫిక్ డైవర్స్‌ను ఇచ్చిన ప్రాంతంలో తరచూ వాహన చోదకులకు ఇబ్బందిగా ఉంది. మంగమూరు రోడ్డు జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ పాయింట్ ఉంది. అక్కడ అర్థం పర్థం లేని ట్రాఫిక్ డైవర్షన్ వల్ల ప్రజలు కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. గాంధీనగర్ ఏరియా కూడా చాలా పెద్ద నివాస ప్రాంతం. గాంధీనగర్‌కు అటువైపున మంగమూరు ఆశ్రమం వరకు అనేక కాలనీలు, అపార్ట్మెంట్లు ఉన్నాయి. నిత్యం అటువైపు వందలాది వాహనాలు టౌన్‌లోకి వస్తూ, పోతుంటాయి. మంగమూరు రోడ్డు సిగ్నల్స్ పాయింట్లు నాలుగు వైపులా వినియోగించుకోకుండా ఒకవైపు మూసేసి ట్రాఫిక్ డైవర్షన్ ఇవ్వడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంకోవైపు కర్నూల్ రోడ్డు ప్లైఓవర్ నుంచి అంజయ్య రోడ్డు నుంచి వచ్చే వాహనాలు గతంలో అంజయ్య రోడ్డు సమీపంలోని బైపాస్‌లోకి వదిలే వాళ్లు. ఇప్పుడు అక్కడ కూడా మూసేసి మరికొంత దూరంలో బైపాస్‌లోకి డైవర్షన్ పెట్టారు. ఇలా మంగమూరు రోడ్డు బైపాస్ ప్రాంతాన్ని ముక్కలు ముక్కలుగా చేసి వాహనాలను మళ్లిస్తుండటంతో... ఆ ప్రాంతంలో ఏ రోజు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



శంకుస్థాపన చేస్తున్న తెలుగుదేశం నాయకులు

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మార్టూరు కేంద్రంలో మరుగుదొడ్లు లేక ప్రజలు, ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. గత ప్రభుత్వ హయాంలో ఎంతో మంది రాజకీయ నాయకులు, అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేదు. ఇటీవల పర్చూరు శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావుకు స్థానిక టిడిపి నాయకులు సమస్య వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే పంచాయితీ అధికారులతో మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయింపజేశారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న పెద్దకాన సమీపంలో టిడిపి నాయకులు తొండెపు ఆదినారాయణ, షేక్ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. దీంతో స్థానికుల్లో హర్షం వ్యక్తం అవుతుంది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న గొట్టిపాటి ఝాన్సీ

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - అద్దంకి

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని మణికేశ్వరంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సతీమణి గొట్టిపాటి ఝాన్సీ హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు భోజనాన్ని స్వయంగా వడ్డించి అన్న ప్రసాదం వితరణ చేశారు. అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నేతలు కరిముల్లా, బలరామిరెడ్డి, మిరావలి, మౌలాలి, బడావలి ఉన్నారు.

పంటలు పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - చీరాల

గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంట నష్టం అంచనా వేసేందుకు ఎఒ, విఎఎలు కలిసి వాడరేవు, బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, గవినివారిపాలెం గ్రామాల్లో శుక్రవారం పరిశీలించారు. వర్షపాతం సరాసరి 87.8 మిల్లీ మీటర్లుగా నమోదైందని, వరి పంటకు ఎటువంటి నష్టం లేదని అన్నారు. వ్యవసాయ సహాయకులు రమేష్ మెక్కజొన్న పంట 10 నుండి 25 రోజుల దశలో ఉన్నదని అన్నారు. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారని అన్నారు. తేమ ఎక్కువగా ఉంది గనుక పొలం ఆరిన ఐదు రోజుల తర్వాత 20కేజీల యూరియా చల్లుకోవాలని చెప్పారు. 10 కిలోల పొటాష్‌పై పాటుగా వేయాలని అన్నారు. కార్యక్రమంలో విఎఎలు రమేష్, హదస్సహా, శ్రావ్య, ప్రసన్న పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేస్తామనటం హర్షనీయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఉద్యోగ, ఉపాధ్యాయలపై కేసులు ఎత్తివేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించటం హర్షణీయమని ఎపి సిపిఎస్ఇఎ జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ అన్నారు. 2022 నాటి ప్రభుత్వం ఛలో విజయవాడ సందర్భంగా సిపిఎస్ ఉద్యోగులపై కేసులు నమోదు చేశారు. అందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

జోరుగా 'మెడిసిన్' దందా

- ఒకరిపేరుతో అనుమతి పొంది వేరొకరి వ్యాపారం
- శాంపిళ్లు, కాలం చెల్లిన మందుల విక్రయాలు
- నామమాత్రంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు
- షాపుల్లో కానరాని ఫార్మసిస్టులు



ప్రజాశక్తి - రేపల్లె

ఫార్మాసిస్టు ఉండడు. ప్రిస్కిప్షన్ అవసరం ఉండదు. మందుల అమ్మకాలు మాత్రం యథేచ్ఛగా సాగుతాయి. ఏదైనా అడిగితే ఆ మందును డాక్టర్ చిట్టీ లేకుండానే చేతిలో పెట్టేస్తుంటారు. కడుపు నొప్పి, కాలు నొప్పి ఏదైనా సరే మెడికల్ షాప్‌కు వెళ్తే మందులు ఇచ్చేస్తున్నారు. నిద్ర రాకపోయినా, గర్భం దాల్చవద్దన్నా ట్యాబ్లెట్లు అడిగితే ఆ ట్యాబ్లెట్లను ఇట్టే ఇచ్చేస్తున్నారు. ఆ మందులను ఎలా వేసుకోవాలో వారే సూచిస్తారు. మరికొన్ని మందులు షాపుల్లో అయితే ఇంజక్షన్, సెలైన్, బ్లడ్ టెస్ట్ కూడా మెడికల్ షాపు నిర్వాహకులు అందిస్తున్నారు. ఈ తరహా రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుందని సమాచారం. ప్రతిరోజు పట్టణ పరిధిలో దాదాపు లక్షల పైన మందుల అమ్మకాలు జరుగుతుంటే అందులో సగం ప్రిస్క్రిప్షన్ లేకుండానే జనం చేతిలోకి వెళ్లిపోతున్నాయి. ఇదీ కొన్ని సార్లు బాగానే ఉన్నప్పటికీ మరికొన్ని సార్లు రోగి ప్రాణాలకు ప్రమాదంగా మారుతోంది. డి ఫార్మసీ, ఎం ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటే చాలు మెడికల్ షాపు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడంతో దుకాణదారులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు మెడికల్ షాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకోకుండా మామూళ్లకు లొంగిపోతున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డవారు కొందరు దగ్గుకు వాడే సిరప్‌లు తాగుతున్నారు. కోరెక్స్, పెన్సిడ్రిల్ వంటి ఔషధాలు కొంత మత్తును కలిగిస్తాయి. ఈ తరహా సిరప్‌లు డాక్టర్ రాసిస్తేనే రోగికి ఇవ్వాలి. కానీ కొన్ని మెడికల్ షాపుల్లో ఎవరెన్ని, ఏమి అడిగినా ఇచ్చేస్తున్నారు. డ్రగ్స్, కాలపరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే, వాటికి బదులు వేరే కంపెనీ మందులు అంటగడుతున్నారు. ఏమన్నా అంటే 'సేమ్ ఫార్ములా, కంపెనీ మాత్రమే వేరు. ఇది కూడా దానిలాగే పనిచేస్తుంది.' అని చెబుతున్నారు. రేపల్లె పరిధిలో సుమారు 60వరకు రీటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపులున్నాయి. అనేక షాపుల్లో కాలం చెల్లిన మందులు యథేచ్ఛగా అమ్ముతున్నారు.

లైసెన్స్ ఒకరిది, నిర్వహణ మరొకరిది

పట్టణంలో మందుల షాపులు బినామీ వ్యక్తులే నిర్వహిస్తున్నారు. ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితో మాత్రమే దుకాణాలు నిర్వహించాలి. చాలా మంది తక్కువ వేతనంతో మెడికల్‌పై పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

నిద్ర మత్తులో అధికారులు

పట్టణంలో మెడికల్ షాపుల్లో సాగుతున్న అవకతవకలపై నిఘా కొరవడం వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. ఎప్పటికప్పుడు మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్‌తో పాటు అన్నిరకాల నిబంధనలు పరిశీలించాల్సిన అధికారులు నిద్రమత్తులో ఉండటంతో మెడికల్ వ్యాపారులదే ఇష్టారాజ్యమైంది.

పర్సంటేజీలు మాట్లాడుకొని

జనరిక్, నాన్ జనరిక్ అనే తేడా లేకుండా షాపుల నిర్వాహకులు ఔషధ కంపెనీలతో పర్సంటేజీలు మాట్లాడుకొని వైద్యులతో కుమ్మక్కై ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా డ్రగ్ కంట్రోల్ అధికారులు స్పందించి నిబంధనలు పాటించని మెడికల్ షాపులు, కెమిస్ట్ డ్రగిస్ట్ ఏజెన్సీలపై దృష్టిసారించి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

టెక్ మహీంద్రాలో ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

టెక్ మహీంద్రాకంపెనికి 25 మంది విద్యార్థులు ఉద్యోగులుగా ఎంపికైనట్లు సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఇటీవల టెక్ మహీంద్రా కంపెని సాఫ్ట్వేర్ ఇంజినీర్ల కొరకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో బిటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న 25 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. ఈ పరీక్షకు 551 మంది ఆపిటిట్యూడ్ లాజికల్ రీజనింగ్ పరీక్షకు హాజరు కాగా 25మంది ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రు.4 లక్షల నుండి రు.5.50 లక్షల వరకు వార్షిక వేతనం, ఇతర సౌకర్యాలు ఇస్తారని ప్రాంగణ ఎంపికల అధికారి నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. టెక్ మహీంద్రా కంపెని క్యాంపస్ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులకు సిఎస్ఇ విభాగాధిపతి పి హరిణి, ఇసిఇ విభాగాధిపతి డి రాజేంద్ర ప్రసాద్, ఎఐఎంఎల్ విభాగాధిపతి సి హరికిషన్, ఐటి విభాదిపతి ఎస్ ఇంద్రనీల్, డేటా సైన్స్ విభాగాధిపతి కె సుబ్బారావు, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి ఎం రమేష్ అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో వనమ రామకృష్ణరావు

పుస్తక పఠనం విజ్ఞానానికి ఆయుధం

ప్రజాశక్తి - పంగులూరు

పుస్తక పఠనం ద్వారా సమాజంలో నెలకొన్న అనేక అంశాలను తెలుసుకునే అవకాశం ఉందని, పుస్తక పఠనం విజ్ఞానానికి ఆయుధం వంటిదని గ్రంథ పాలకుడు కనుమూరి సంజయ్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక పఠనం నిర్వహించారు. ప్రజలు గ్రంథాలయాలకు వచ్చి మంచి విజ్ఞానాన్ని పొందాలని సంజయ్ బాబు కోరారు.

అద్దంకి : స్థానిక గ్రంథాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 2వ రోజు పుస్తక ప్రదర్శన శుక్రవారం ఏర్పాటు చేశారు. మారక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక ప్రాముఖ్యత గురించి సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రాజు పాఠకులకు వివరించారు. వివిధ రకములైన కొత్త పుస్తకంలను గ్రంథ పాలకుడు చుండూరి సుగుణరావు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

నిజాంపట్నం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శనను గ్రంథ పాలకులు ఎన్ విజయలక్ష్మి నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిరోజు మంచి పుస్తకాలు చదవటం వల్ల వచ్చే లాభాలు, జ్ఞాపకశక్తి పుస్తకాలు చదవడంతో సమాజంలో జరుగుతున్న వాటపై అవగాహన కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొల్లూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను పంచాయతీ కార్యదర్శి బి మల్లికార్జున శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవ గాహన కల్పించారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయంను సందర్శించి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. తదనంతరం విద్యార్థులకు పుస్తకాల చదవడం, సమాజం నుండి మారక ద్రవ్యాలు ఎలా అరికట్టాలనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వై రాంబాబు పోటీలను పర్యవేక్షించారు.

17న ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని గంగవరంలో బిపి షుగర్ రెగ్యులర్ మెడికల్ క్యాంప్ ఈనెల 17న ఆదివారం మంచాల వెంకటరామయ్య, రంగమ్మ విద్యా వైజ్ఞానిక కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు క్యాంపు కన్వినర్ కరి బాలచంద్ర తెలిపారు. డాక్టర్ మంచాల రమేష్ కుమార్, డాక్టర్ ఎ సాంబయ్య వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. బోడేంపూడి ప్రకాశరావు, సీతారావమ్మ స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రోడ్డు దాటుతున్న వృద్ధుడిని లారీ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో చోటుచేసుకుంది. స్థానిక కిషోర్ కాలనీకి చెందిన దార్ల పెద్ద వెంకటేశ్వర్లు వ్యక్తిగత పనుల నిమిత్తం అంబేద్కర్ కాలనీ సమీపంలో నేషనల్ హైవే దాటుతుండగా ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న టమాటో లోడ్ లారీ ఒక్కసారిగా వెంకటేశ్వర్లును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎఎస్సై మహబూబ్ బాషా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాటుసారా బట్టీలు ధ్వంసం

ప్రజాశక్తి - నగరం, నిజాంపట్నం

స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీరాం ప్రసాద్ ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు నిజాంపట్నం మండలంలోని దిండి పంచాయతిలోని అదవల గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటు సారా కాస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు బాపట్ల ఈఎస్టీఎఫ్ ఎఈఎస్ బి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐలు ఆర్ నరహరి, ఎస్ రామారావుతో కలిసి అడవల ప్రాంతానికి దక్షిణ దిశగా 3 కిలోమీటర్ల దూరంలోని సముద్ర తీరం వెంబడి మడ అడవుల్లో దాడులు నిర్వహించారు. రెండు ప్రాంతాల్లో నాటు సారా తయారీ కోసం దాచి ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు సీఐ చెప్పారు. నాటు సారా తయారీ కోసం ఏర్పాటు చేసిన సారా బట్టీని ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటు సారా తాయారు చేసి అమ్మే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుంది. నాటు సారా తయారీ, అమ్మకాల గురించి సమాచారం తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నిజాంపట్నం మండలంలో నల్లబెల్లం విక్రయించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్ కె వెంకటరమణ, పి శ్రీనివాసరెడ్డి, కె శ్రీనివాసరెడ్డి, ఎస్ పెద్దయ్య, కె మధు సూదనరావు, డ్రైవర్ పి భాస్కర్ పాల్గొన్నారు.

16న ఓరియంటేషన్ ట్రైనింగ్

ప్రజాశక్తి - పంగులూరు

2025– 26 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఈ నెల 16న స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని ఎంపిడిఒ కె స్వరూపరాణి శుక్రవారం తెలిపారు. శిక్షణ 2బ్యాచులుగా విభజించామని తెలిపారు. శిక్షణకు ఎంపిపి, జడ్పిటిసి, ఎంపీటీసీలు, పంచాయతీ సర్పంచులు హాజరు కావాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డిఎం

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి సంబంధించిన సమస్యలపై ఫోన్ ద్వారా సలహాలు సూచనల కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 4గంటలకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సమస్యలపై 99592 25425 ఫోన్ చేయవచ్చున్నారు.

సముద్ర స్నానాలకు పోటెత్తిన జనం



సముద్ర హారతినిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



కార్తీక పూజల్లో చీరాల ఎమ్మెల్యే కొండయ్య దంపతులు

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక బీచ్‌లో కార్తీక పౌర్ణమి సముద్ర స్నానాలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో పర్యాటకుల సంఖ్య కొంత మేర తగ్గినట్లు చెబుతున్నారు. అయినప్పటికీ అధికారులు పర్యాటకులకు అవసరమైన భద్రతా చర్యలపై అత్యంత జాగ్రత్తలు తీసుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామునే సూర్యలంక సముద్రతీరంలో సాగర హారతిలో శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సతీ సమేతంగా నిర్వహించారు. సాగర హారతి కార్యక్రమంలో మాచర్ల శాసన సభ్యులు జూలగంటి బ్రహ్మానందరెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివ నారాయణ, యార్లగడ్డ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార శిబిరం వద్ద పర్యాటకులకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అల్పాహారం అందజేశారు. జనసేన నాయకులు నామన వెంకట శివన్నారాయణ ఆధ్వర్యంలో సముద్ర స్నానానికి విచ్చేసిన పర్యాటకులకు అయ్యప్ప, శివ స్వాములకు ప్రత్యేకంగా తయారు చేసిన అల్పాహారాన్ని అందజేశారు. వైసిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార కేంద్రాన్ని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి ప్రారంభించారు.

చీరాల : కార్తీక మాస సముద్ర స్నానాల సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కుటుంబ సమేతంగా వాడరేవు సముద్ర తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను సముద్రంలో వదిలారు. శుక్రవారం వేకువ జాము నుంచే శివాలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. ఈ నేపథ్యంలో సముద్ర స్నానాలకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు నిర్వహించారు.

నిజాంపట్నం : స్థానిక హార్బర్ నందు కార్తీక పౌర్ణమి సందర్భంగా పుణ్యస్నానాలకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. ఏటువంటి అవాంఛనీయాలు ఘటనలు లేకుండా గట్టి బందోబస్తు నడుమ భక్తులు పుణ్య స్థానాలు ఆచరించారు. భక్తులకు అల్పాహారం పొంగలి, పులిహార, త్రాగునీటిని ఏర్పాటు చేసిన మైరైన్ బోట్లు యూనియన్ అధ్యక్షుడు బొమ్మిడి రామకృణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివ ప్రసాద్ ప్రారంభించారు. సముద్రతీరానికి వచ్చే యాత్రికులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, స్థానిక నాయకులకు సూచించారు. దిండి పంచాయితీలోని పరిషవారిపాలెం బీచ్‌కు వెళ్లి అక్కడ పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులకు సౌకర్యాలు పర్యవేక్షించారు. తహశీల్దారు షాకీర్ పాషా, ఎంపిడిఒ నర్రా నాగలక్ష్మి పాల్గొన్నారు. టిడిపి నాయకుడు పంతానీ మురళీధరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ, టిడిపి అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్ యాదవ్, రూరల్ సీఐ సురేష్ బాబు, ఎస్ఐ తిరుపతిరావు, నిజాంపట్నం కార్యదర్శి శ్రీనివాసరావు, నరసింహమూర్తి, ఇమ్రాన్ ఖాన్, శీలం కోటేశ్వరరావు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న అనగాని శివప్రసాద్



మురళీధరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

మురళీధరరావుకు సత్కారం

ప్రజాశక్తి - బాపట్ల

పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని నీలి బంగారయ్య ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లపాటు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కె మురళీధరరావు విద్యాభివృద్ధితో పాటు పాఠశాల అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని, చందోలు ఆదర్శ గ్రామాభ్యుదయ కమిటీ సభ్యులు మురళీధరరావు సేవలను కొనియాడారు. శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, రఫీ మాస్టారు, జాబిర్ ముహమ్మద్, మస్తాన్ బేగ్, రియాసత్ అలీ ఖాన్, మజ్హర్ బాషా, ఆరిఫ్ ముహమ్మద్, కొండవీటి శీను, పట్టాభి, రామారావు, ఈస్టర్ భాష పాల్గొన్నారు.



సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు

వృద్ధ దంపతులకు ఆపన్న హస్తం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఎటువంటి ఆసరా లేని వృద్ధ దంపతులకు తామున్నామంటూ హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు ఆపన్న హస్తం అందించారు. మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి ఏందిరా షేక్ మస్తాన్, షేక్ మస్తాన్ బి దంపతులకు ఎటువంటి ఆసరా లేక కొండరాళ్లు పగలగొడుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల దంపతులిద్దరూ పక్షవాతానికి గురయ్యారు. 79ఏళ్ల వయసులో ఈ వృద్ధ దంపతులు పడుతున్న కష్టాలు చూసి చలించిన హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు పఠాన్ కాలేషావలి ఆధ్వర్యంలో రూ.5వేలు నగదు, షేక్ కాలేషా సహకారంతో 25కేజీల బియ్యం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు విశ్రాంత, ఎస్ఐ కె హరిబాబు, షేక్ హాభిబా, షేక్ ఖాదర్ భాష పాల్గొన్నారు.

విఠలేశ్వరనగర్ కాలనీలో తగ్గిన నీరు

ప్రజాశక్తి - భట్టిప్రోలు



నివాస గృహాల మధ్య నిలిచిన నీరు

భట్టిప్రోలు విఠలేశ్వర నగర్ కాలనీ ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలకు కాలనీ పూర్తిగా నీట మునగటంతో అధికారులు కాలనీ పక్కనే ఉన్న వెల్లెటూరు ఛానల్ నీరు తగ్గించి కాలనీలోకి ప్రవేశిస్తున్న తూముల ద్వారా నీటిని కాలువలకు మళ్లించారు. కాలనీ లో నీరు లేకుండా చూడగలిగారు. కానీ ఈ ఛానల్‌కు సాగు నీరును విడుదల చేయడంతో అదే తూముల ద్వారా నీరు ఎగదట్టి కాలనీ మరోసారి పూర్తిగా మునిగిపోయింది. మోకాటిలోతుపైగా నీరు రహదారులపై ప్రవహిస్తూ గృహాలను చుట్టుముట్టింది. పత్రికల ద్వారా అధికారులకు విన్నవించడంతో మండల సమావేశంలో అధికారులు ప్రజాప్రతినిధులు కాలనీ పరిస్థితిని చర్చించారు. స్పందిం చిన నీటిపారుదల శాఖ ఏఈ వెల్లటూరు ఛానల్‌కు నీటిని తగ్గించటంతో కాలనీలోని నీరు తూము ద్వారా కాలువ లోకి ప్రవేశించి కాలనీ నీటి నుండి బయటపడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పంచాయతి అధికారులు కార్మికుల ద్వారా ఈ తూముల ను మూసివేసి భద్రపరుస్తున్న ప్పటికీ కాలనీ సమీపంలోని చేపల చెరువు నిర్వాహకులు నీటి కోసం తూములను తీసివేయడంతో ఈ తూము ద్వారా నీరు ప్రవేశించి కాలనీ మునిగిపోతుందని, చేపల చెరువు నిర్వాహకులు చేసే ఇలాంటి చర్యల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అతనిపై తగిన చర్యలు తీసుకుని 200 కుటుంబాలు నివసిస్తున్న కాలనీని రక్షించాలని కోరుచున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావు మాట్లాడుతూ మరోసారి మూసివేసిన తూమును ఓపెన్ చేసి కాలనీ ముంపుకు కారకుడైనట్లు వెలుగులోకి వస్తే అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెనుమూడిలో సినిమా షఉటింగ్

ప్రజాశక్తి - రేపల్లె



షూటింగ్‌లో నటీ, నటులు సన్నివేషన్

భారతదేశ మాజీ ఉప ప్రధాని, దళిత బహుజన బాంధవుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్ర ఆధారంగా ఆయన బాల్యం నుండి చివరి వరకు యదార్థ సంఘటనలతో ఆయన జీవిత చరిత్ర బాబూజీ చిత్రంగా ప్రజల ముందుకు తీసుకు వస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (ఎపి మా) వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ దర్శకుడు దోనెపూడి దిలీప్ రాజా తెలిపారు. గత వారం రోజులుగా తెనాలి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్న జగజ్జీవన్ రామ్ బయోపిక్ షఉటింగ్ శుక్రవారం పెనుమూడి రేవు దగ్గర జరిగింది. ఇందులో సీనియర్ నటుడు నరసింహరాజు, ము ంబై నటి కావ్య కీర్తి, ఎర్రబాబు, జర్నలిస్ట్ భాస్కర్ నటించినట్లు దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. బీహార్ రాష్ట్రంలోని చాంద్వా గ్రామంలో జరిగిన సంఘటనను ఈ ప్రాంతంలో చిత్రీకరించినట్లు పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ మురళి, మేకప్ జనార్ధన్, ఆర్ట్ డైరెక్టర్ రత్నాకర్ కనపర్తి, ప్రొడక్షన్ మేనేజర్ మునిపల్లి శ్రీకాంత్, సహాయ దర్శకుడు నరేష్ స్వామి, హాజీ ప్రధాన సాంకేతిక వర్గం కాగా దిలీప్ రాజా కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహిస్తున్నారు. 2025లో సినిమాని విడుదల చేస్తామని నిర్మాత ప్రదీప్ దోనేపూడి చెప్పారు.

గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు నెలల క్రితం భట్టిప్రోలు పంచాయతీకి చెందిన రికార్డులను అవినీతి ఆరోపణలతో భద్రపర్చి ఉంచగా వాటిని శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా సీఈఒ వి జ్యోతిబసు ఆధ్వర్యంలో పరిశీలించారు. గత వైసిపి పాలనలో అవినీతి జరిగినట్లు గ్రామస్తులు ఆరోపించడతో ఉన్నతాధికారులు పరిశీలన చేయాలని రేపల్లె డిఎల్పిఓ నరసింహారావు ఆధ్వర్యంలో వాటిని స్వాధీనపర్చుకొని మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరిచారు. మరోసారి బృందాల పరిశీలనలో వెలుగు చూసిన అంశాలను సీఈఓ ఆధ్వర్యంలో మరో 20మంది వరకు పంచాయతీ అధికారులు శుక్రవారం మూడేళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో డిపిఒ కెఎల్ ప్రభాకర రావు, డి ఎల్డిఓలు ప్రసాద్, మంగాపూరనాథ్, డిఎల్‌పిఓ నరసింహారావు ఉన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుడు షాజాద్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయునికి అభినందనలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఉత్తమ ఉపాధ్యాయునిగా మండలంలోని గుల్లపల్లి గ్రామానికి చెందిన ఎండి షాజాద్‌ను ముస్లిం పెద్దలు శుక్రవారం అభినందించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానంలో భాగంగా ఇటీవల విజయవాడలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మక్కా మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షాజాద్‌ను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎండి అజీముద్దీన్, ఆసిఫ్ అలీ, మస్తాన్, మల్లికా అహ్మద్, షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

ప్రజాశక్తి - కారంచేడు

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని జరుబుల వారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఎఓ కె సుధీర్ బాబు మాట్లాడుతూ పొగాకు ధరలు ఎక్కువగా ఉన్నాయని అందరూ పొగాకు సాగుపై దృష్టి పెడు తున్నారని, దీనివలన ఒకేసారి ధరలు పతనమయ్యే అవకాశాలు ఎకువగా ఉంటాయని అన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ, మొక్కజొన్న, మినుము పంటలను సాగు చేయాలని సూచించారు. దీని ద్వారా రైతులు ఒకే పంట వేయకుండ ఉన్నపుడు ఎదో ఒక పంటలో లాభాలు పొందవచ్చని తెలిపారు. శనగ పంటకు విత్తనశుద్ధి చేసుకోవాలని తెలిపారు. పంటకు ఎకరానికి రూ.84పంటల బీమా పథకాన్ని నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ కిషోర్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - కారంచేడు

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ఆయా పంచాయతీల పాలకవర్గ సభ్యులు, ఎంపిటిసిలకు ఒకరోజు శిక్షణ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఎంపిడిఒ కె నేతాజీ మాట్లాడారు. ఎపి ఎస్ఐఆర్డి నుండి జాయింట్ డైరెక్టర్ రామనాథం, డిపిఆర్సి సిబ్బంది ఆధ్వర్యంలో 2025 - 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గురించి జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌ల ద్వారా ఒకరోజు శిక్షణ నిర్వహించారు.

చెరుకుపల్లి : గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపిపి మత్తి దివాకర రత్నప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తహశీల్దారు పద్మావతి, జడ్పిటిసి మర్రివాడ వెంకట పావని, ఎంపిపి రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

రేపల్లె : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నందు ఎంపీడీఓ ఏం శోభారాణి ఆధ్వర్యంలో పంచాయతీల అభివృద్ధి, ప్రణాళికలపై శిక్షణ నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ప్రణాళికా బద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమవు తుందని సూచించారు. ప్రజా ప్రతినిధులను భాగస్వాము లను చేసి పంచాయతీలకు వస్తున్న నిధులు రూపొం దించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఈ చక్రవర్తి, ఎన్ఆర్జిఎస్ ఎఓ సుబ్బరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ గోపాలకృష్ణ, వెలుగు ప్రాజెక్ట్ ఎఓ త్యాగరాజు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి సుచిత్ర, వెటర్నరీ డాక్టర్ ప్రవీణ్ కుమార్, వ్యవసాయ శాఖ ఎఓ విజయబాబు, ఎంఇఒ సురేష్ రత్న, శ్రీధర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ

- గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి
- కలెక్టర్ తమీమ్అన్సారియా ఆదేశం



నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పొన్నలూరు

పేదలకు నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి గహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ తమీమ్ అన్సారియా కొండపి నియోజకవర్గం, పొన్నలూరు మండలం, పర్చూరివారి పాలెం గ్రామం వద్ద పేదలకు నిర్మిస్తున్న కాలనీలను సందర్శించి గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఈ గ్రామంలో మొత్తం 40 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, అందులో 12 మంది లబ్ధిదారులు తమ సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకున్నారని, 28 మందికి ప్రభుత్వ స్థలంలో ఇల్లు మంజూరు చేయడం జరిగిందని హౌసింగ్ పిడి శ్రీ శ్రీనివాస ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. మొత్తం 40 గహాల్లో 20 ఇల్లు పూర్తి కాగా, బేస్మెంట్ కన్నా తక్కువ స్థాయిలో 3, బేస్మెంట్ స్థాయిలో 13, రూఫ్ స్థాయిలో 3, రూఫ్ కాస్ట్ స్థాయిలో ఒక ఇల్లు ఉన్నాయని పీడీ వివరించారు. ఇళ్ల నిర్మాణాలు పురోగతిపై హౌసింగ్ ప్రతి రోజు పర్యవేక్షణ చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు స్టేజీ అప్డేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు కాలనీల్లో విద్యుత్, సైడు కాలువలు, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొంతమంది గృహాల లబ్దిదారులతో ముఖాముఖి మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.? అని అడిగి తెలుసుకున్నారు. తాము గృహనిర్మాణ సామాగ్రి తెచ్చుకునేందుకు సరైన రహదారి లేక కొంత ఇబ్బంది పడుతున్నామని కలెక్టర్ దష్టికి తీసుకురాగా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ రహదారి ఏర్పాటు చేసి వారికి సామాగ్రి తెచ్చుకునేందుకు వీలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, ఎంపిడిఒ సుజాత, తహశీల్దార్ పుల్లారావు, డిఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలి

- ఎస్‌పి ఏఆర్ దామోదర్
- వ్యాసరచన పోటీల విజేతకు బహుమతి ప్రదానం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులు ఉత్తమ చదువులతో ఉన్నత స్థానాలకు చేరుకొని సమాజంలో నలుగురికి ఆదర్శంగా నిలివాలని ఎస్‌పి ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలో వివిధ కళాశాలు, పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతగా నిలిచిన పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కెజిబివి (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం) జూనియర్ కాలేజీలో చదువుతున్న బి.వెంకటమ్మకి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థులకు 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర' అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో మొదటి విజేతగా నిలిచిన బి.వెంకటమ్మ ప్రథమ బహుమతిగా రూ.5 వేలు నగదు బహుకరించారు. బి.వెంకటమ్మ చదువు వివరాలు, కుటుంబ నేపథ్యం, అలవాట్లు మొదలైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పుల్లలచెరువు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ స్టాఫ్ నర్స్ బి విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైసిపి ఒంగోలు నియోజకవర్గ

సమన్వయకర్తగా చుండూరు రవి



జగన్‌తో రవి (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్తగా సీనియర్ రాజకీయ నాయకులు చుండూరు రవిబాబును నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనున్న నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చుండూరు రవిబాబు వైసిపి జిల్లా కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డిని వారం రోజుల క్రితం తాడేపల్లిలో పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. ఒంగోలు నియోజకవ్గ పార్టీ బాధ్యతలు తీసుకోవాలని ఈ సందర్భంగా జగన్ రవిబాబుకు సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రవిబాబును ఒంగోలు నియోజవర్గ సమన్వయకర్తగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. చుండూరు రవిబాబు జిల్లా రాజకీయాల్లో అనేక సంవత్సల నుంచి సీనియర్‌గా ఉన్నారు. వైసిపిలో చాలా కాలం నుంచి జిల్లా నాయకునిగా కొనసాగుతున్నారు. చుండూరు రవిబాబు భార్య కోమలేశ్వరి ప్రస్తుతం ఒంగోలు మండల జడ్పీటిసిగా ఉన్నారు. వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించిన పార్టీ అధక్షులు జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకు సహకరించిన నేతలకు శుక్రవారం రవిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని రవిబాబు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

'ఒడా ఛైర్మన్' ఎవరికో.?

- జనసేనకే వస్తుందని ప్రచారం..
- కాపు సామాజికవర్గానికి కేటాయించే అవకాశం
- రియాజ్ పేరు పెండింగ్‌లో పెట్టిన 'కూటమి' ప్రభుత్వం
- ఆయనకు రాకుంటే కార్పొరేటర్ మలగా రమేష్‌కు వచ్చే ఛాన్స్.!



రియాజ్, మలగా రమేష్ (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నామినేటెడ్ పదవులకు సంబంధించి ఇప్పటికే రెండు జాబితాలను ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఒడా) ఛైర్మన్ ఎవరనేది మాత్రం ప్రకటించలేదు. గతంలో వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ పదవి కాపులకే ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఈ ఛైర్మన్ పదవి జనసేనకు ఇస్తుందనే ప్రచారం ఉంది. రెండో జాబితాలో రియాజ్ పేరు వస్తుందని ప్రచారం జరగ్గా.. అనివార్య కారణాల వల్ల ఆ పేరును పెండింగ్‌లో పెట్టారు. రియాజ్‌కు ఇవ్వకుంటే జనసేనలో కాపులకే ఛైర్మన్ పదవి ఇవ్వాల్సి వస్తే.. ఒంగోలు కార్పొరేటర్ మలగా రమేష్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది.

ఒడా ఛైర్మన్ పదవిని ముందుగా జిల్లాలో జనసేనకి ఇవ్వాలని కూటమి నేతల్లో చర్చ వచ్చింది. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రియాజ్ కూడా ఈ రేసులో ఉన్న నేపథ్యంలో రెండో జాబితాలో ఆయన పేరు వస్తుందని అందరూ భావించారు. చివరలో జాబితాలో ఒడా ఛైర్మన్ పదవిని పెండింగ్‌లో పెట్టారు. ఈ పదవి కాపులకే ఇవ్వాలినే కారణంతోనే రియాజ్ పేరును ప్రకటించలేదనే ప్రచారం ఉంది. రియాజ్‌కు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్ర స్థాయిలో ఏదైనా మంచి గుర్తింపు ఉండే పదవి ఇస్తారనే చర్చ కూడా ఉంది. రియాజ్‌కు రాష్ట్ర స్థాయి పదవి వస్తే.. ఇక్కడ ఒడా ఛైర్మన్ కాపులకు ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని టిడిపి నేతలంటున్నారు. గత ఎన్నికల్లో ఒంగోలు నగరంలో దామచర్లను గెలిపించడంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు రియాజ్‌తో పాటు నగర అధ్యక్షుడు, కార్పొరేటర్‌గా మలగా రమేష్ గట్టి ప్రయత్నం చేశారు. కార్పొరేటర్‌గా నగర సమస్యలపై కూడా రమేష్‌కు మంచి అవగాహన ఉంది. కార్పొరేటర్‌గా ఉండటం, ఒక పార్టీకి నగర అధ్యక్షుడుగా ఉండటం కూడా కలిసి వచ్చే అంశం. మలగా రమేష్‌తో పాటు ఒడా ఛైర్మన్ రేసులో గిద్దలూరు సమన్వయకర్త బెల్లంకొండ సాయిబాబా, దర్శి ఇన్‌ఛార్జి బొడ్డుకూరి రమేష్, సంతనూతలపాడు ఇన్‌ఛార్జి కందుకూరి బాబు ఉన్నారు. ఒడా ఛైర్మన్ ప్రకటన మరో రెండు మూడు రోజుల్లో ఉంటుందని సమాచారం.

ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలం పరిశీలన

ప్రజాశక్తి-పొన్నలూరు

మండలంలోని సంగమేశ్వరం వద్ద నూతనంగా ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించేందుకు నిర్దేశించిన ప్రతిపాదిత ప్రదేశాన్ని శుక్రవారం కలెక్టర్ ఎ.తమీమ్అన్సారియా ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి నివేదికను అందజేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ఇరిగేషన్ ప్రాజెక్ట్ డిఈ కరిముల్లా, తహశీల్దార్ పుల్లారావు, ఎంపిడిఓ సుజాత పాల్గొన్నారు.

ఆ రహదారిపై ప్రయాణం..

నరకయాతనే.!

- చీమకుర్తి క్వారీల మధ్య అన్నీ గుంతలే..
- వర్షం పడితే చెరువుగా మారుతున్న రోడ్డు
- చిన్నచిన్న వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



రోడ్డుపై గుంతలలో నిలిచిన వర్షపునీరు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రహదారుల మరమ్మతుల పేరుతో ఇటీవల పాలకపక్ష నేతలు హడావుడి చేశారు. గుంతల్లో మట్టి పోసి హంగామా సృష్టించారు. రహదారుల రూపురేఖలు మార్చుతున్నట్లు ప్రచారాలు చేసుకున్నారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్ల పరిస్థితి ఏమిటో తేటతెల్లమవుతోంది. ప్రధానంగా ఒంగోలు-కర్నూలు రహదారిలో చీమకుర్తి మండలంలోని గ్రానైట్ క్వారీల మధ్య ప్రయాణిస్తే తెలుస్తుంది. ఈ రహదారిని విస్తరణ చాలా కాలంగా పెద్ద సవాలుగా మారింది. ఇప్పుడు ఆ రోడ్డు చెరువుగా మారింది. అన్నీ గుంతలే. పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. వానలకు నీటితో నిండిపోయాయి. వాహనాలు వెళ్లాలంటే ఎక్కడ ఏ గుంత ఎంత లోతుంటుందో కూడా తెలియడం లేదు. నీళ్లలోకి దించగానే కార్లు తదితర వాహనాలకు కింద భాగాలు తగిలి దెబ్బతింటున్నాయి. వాహనాలు నీళ్లలో నిలిచిపోతున్నాయి. ద్విచక్ర వాహనదారులూ ఇక్కట్లు పడుతున్నారు. పెద్దపెద్ద గ్రానైట్ లారీల మధ్య ఈ గుంతల్లో నీళ్లలో ప్రయాణం నరకంగా మారింది. దీన్ని కనీసం క్వారీల యజమానులైనా పట్టించుకోవడం లేదు. అక్కడ విలువైన గ్రానైట్ నిక్షేపాలున్నందున దాన్ని కూడా తవ్వేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీన్ని తవ్వుకునేందుకు గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు జరిగాయి. ఈ రోడ్డును చీమకుర్తి నుంచి కంభంపాడు మీదుగా దారిమళ్లించి బైపాసును చేయాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. గ్రామాలకు రాకపోకలు పోతాయనే ఆందోళన రేగింది. చీమకుర్తితో పాటు గ్రామాల ప్రజలు వ్యతిరేకించారు. దీంతో రోడ్డును మళ్లించే యత్నాలు అప్పట్లో ఆగిపోయాయి. ఇప్పుడూ విలువైన గ్రానైట్ రోడ్డు కింద ఉన్నందున దానికి ఎసరు పెట్టారనే చర్చ నడుస్తోంది. అందుకే రోడ్డును వేయడం గానీ, బాగుచేయడం గానీ చేయడం లేదు. మర్రిచెట్లపాలెం, రామతీర్థం సమీపంలోనూ పెద్దపెద్ద గుంతలున్నాయి. రాకపోకలకు తగినట్లుగా ఈ రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉంది. జిల్లాలో అన్ని రహదారులు ఏదో పథకం కింద జాతీయ రహదారులుగా మారిపోతున్నాయి. ఒంగోలు-కర్నూలు రోడ్డుకు మాత్రం మోక్షం కలుగడం లేదు. ఇప్పటికైనా జిల్లా ప్రజాప్రతినిధులు ఈ రహదారిని పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది.



అధ్వానంగా ఉన్న రహదారి